




WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...


రంగారెడ్డి గురువారం 26-03-2026 సంపుటి: 01 సంచిక : 279 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday 26-03-2026 Volume :01 Issue: 279 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani









## ఇరాన్ వార్ ఎఫెక్ట్..

- త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్..
- 10-12 శాతం పెంపు..?

న్యూఢిల్లీ

ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంతో ఇప్పటికే ఇండియాలో చమురు సంక్షోభం మొదలైంది. త్వరలో ఎరువుల కొరత వేధించే అవకాశం ఉంది. మరోవైపు ఔషధాల ధరలు కూడా పెరగొచ్చు. ఈ నేపథ్యంలో ఇండియన్స్‌కు మరో షాక్ తగిలే అవకాశం ఉంది. ఇండియాలో త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా విదేశీ బ్రాండ్లు తమ బీర్ల ధరల్ని పెంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది.ఇరాన్ యుద్ధం కారణంగా రవాణా స్తంభించిపోవడమే దీనికి ప్రధాన కారణం. బీర్ల తయారీలో వాడే గ్లాస్ బాటిల్స్, అల్యూమినియం క్యాన్ల తయారీకి అవసరమైన ముడిసరుకు విదేశాల నుంచే వస్తుంది. ప్రస్తుతం యుద్ధం కారణంగా రవాణా నిలిచిపోయి, వీటి దిగుమతులు ఆగిపోయాయి. దీంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. మరోవైపు చమురు ధరలు పెరగడం కూడా బీర్ల తయారీపై ప్రభావం చూపుతోంది.

-మిగతా 2 లో



## ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

- ఇరాన్‌ను సైనికంగా అంతమొందించాం
- ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి
- ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్,

ఇరాన్ తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనికపరంగా అంతమొందించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనేదే తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే..


-మిగతా 2 లో

## కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి

# రాజీనామా

### నాలుగు పేజీల రాజీనామా లేఖ విడుదల

- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా...పట్టించుకోరా
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోంది
- 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆవేదన వ్యక్తం
- ఇక రేవంత్ రెడ్డిపైనే తన పోరాటం అన్న జీవన్ రెడ్డి



**జగిత్యాల - మార్చి 25 నేటి దర్శిని**

కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రాజీనామా చేశారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి

-మిగతా 2 లో



## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి


**హైదరాబాద్, - మార్చి 25 నేటి దర్శిని**

గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు.

-మిగతా 2 లో

## కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

### 27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన



**హైదరాబాద్,**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు-మిగతా 2 లో

## పాక్‌లాగా భారత్ దళారీ దేశం కాదు

- అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదు
- భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉంది
- అఖిలపక్షంలో విదేశాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ

పాకిస్థాన్‌ను 'దళారీ' దేశంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఎప్పడూ మధ్యవర్తిత్వం నెరపే దేశం, దళారీ దేశం కాదని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో యుద్దానికి ముగింపు పలికేలా వాషింగ్టన్-టెహ్రాన్‌తో మధ్యవర్తిత్వం వహించేందుకు పాక్ ముందుకు రావడంపై అఖిలపక్ష


-మిగతా 2 లో


## దేశంలో పెట్రోల్, డీజిల్

# కొరత లేదు

### ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు

- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
- పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోమారు ప్రకటన






**న్యూఢిల్లీ,**

పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది. వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటీఫికేషన్ ఇచ్చామని,

-మిగతా 2 లో




## మీరేమైనా రాజులా... ఎందుకీ నిర్లక్ష్యం

- గురుగ్రామ్ పోలీసుల తీరుపై మండిపడ్డ సుప్రీం
- చిన్నారిపై అత్యాచరం జరిగితే ఇంత నిర్లక్ష్యమా
- క్రాస్ ఎగ్జామిన్ పేరుతో వేధింపులు చేస్తారా
- కనీసం కేసు కూడా పెట్టకుండా ఏం చేస్తున్నారు
- చిన్నారిని పిలిచి పదేపదే ప్రశ్నించడం ఎంత దారుణం
- ఎందుకు వారి ఇంటికి వెళ్లలేక పోయారు
- వెంటనే పోలీసులపై చర్యలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ,

నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో గురుగ్రామ్ పోలీసులు స్పందించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పపట్టింది. ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులతో అధికారులు ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. బాలికను క్రాస్-ఎగ్జామినేషన్ చేసిన అధికారులను మందలిస్తూ.. ఈ చర్యలు ఆ బాలికను మరింత మానసిక వేదనకు గురిచేయడం సహా అగౌరవపరిచాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ కూతురిపై అత్యాచారం జరిగిందని గురుగ్రామ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. నిందితుడి సమక్షంలో మేజిస్ట్రేట్.. ఆ బాలికను ఎలా ప్రశ్నించారనే దానిపై పోలీసులు, జిల్లా న్యాయవ్యవస్థ వివరణ ఇవ్వాలని కోరింది. 'పోలీసులు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేరు? వాళ్లేమైనా రాజులా?' అని ఈ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు.

-మిగతా 2 లో




## తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

- నగరంలో పలుచోట్ల పెట్రో బంకుల మూత
- బంకుల ముందు క్యూ కడుతున్న వాహనదారులు

**హైదరాబాద్ - మార్చి 25 నేటి దర్శిని**


అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో భారతదేశ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్‌కు కొరత ఏర్పడింది. కొన్ని రోజులుగా ప్రజలు వంట గ్యాస్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పెట్రోల్ నిల్వలు కూడా దేశంలో తగ్గిపోయాయన్న ప్రచారంతో బంకుల ముందు వాహనదారులు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. క్యూ కట్టి మరీ బంకుల నుంచి పెద్దఎత్తున ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ అవసరం లేకున్నా లీటర్ల కొద్దీ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు వాహనదారులు. దీంతో పలు బంకులు తాత్కాలికంగా మూతపడ్డాయి.

-మిగతా 2 లో

## ప్రాజెక్టు కుశ పరీక్ష సక్సెస్

ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే దీని లక్ష్యం

2 లో



RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# ఇరాన్ వార్ ఎఫెక్ట్..

మొదటి తరువాయి

ప్రపంచంలో నాలుగోవంతు నేచురల్ గ్యాస్‌ను ఇండియా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అది కూడా ఎక్కువగా పశ్చిమాసియా నుంచే వస్తుంది. అందులోనూ ఖతార్ నుంచే 40 శాతం చమురు దిగుమతి అవుతుంటుంది. కానీ, ఇప్పుడు గ్యాస్ సరఫరా లేక చమురు ధరలు పెరగడం, బాటిల్స్ సరఫరా నిలిచిపోవడంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఈ కారణంగా గ్లాస్ బాటిల్ ధరలు 20 శాతం పెరిగాయి. అలాగే, బీర్లను ఉంచే పేపర్ కార్టన్ రేట్లు కూడా రెట్టింపైనట్లు తయారీ కంపెనీలు చెబుతున్నాయి.లేబుల్స్, టేప్స్ వంటి ధరలు కూడా పెరిగాయి. పరిశ్రమలకు గ్యాస్ సరఫరా లేకపోవడంతో వీటన్నింటి తయారీ సంస్థలు తమ తయారీని తగ్గించాయి. ఫలితంగానే రేట్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీర్ల ధరలు పెంచాలని ప్రయత్నిస్తున్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు. వేసవి కాలం కావడం, డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తమపై భారం తగ్గాలంటే 12 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని ప్రభుత్వాల్ని కోరుతున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వాలు అంగీకరిస్తే త్వరలోనే బీర్ల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

మొదటి తరువాయి

అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హోర్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యాలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్టు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్ధానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించినప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది. తూర్పు ప్రావిన్సులో తమ వాయు రక్షణ వ్యవస్థ ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసిందని సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఆ వివరాల ప్రకారం.. అదే ప్రాంతంలో కనీసం 6 డ్రోన్‌లను కూల్చివేసినట్టు సమాచారం. ఇజ్రాయెల్, కువైట్ దేశాలపైనా ఇరాన్ డ్రోన్ల దాడి కొనసాగిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

## పాక్ లాగా భారత్ దళారీ దేశం కాదు

మొదటి తరువాయి

సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ, పాకిస్థాన్ దళారీ దేశమని అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదని చెప్పారు. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడంతో మధ్యవర్తిత్వం వహించడానికి పాక్ ఉత్సాహం కనబరుస్తోంది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తాము సిద్ధమని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ ఎందుకు మౌనంగా ఉందని విపక్షాలు ప్రశ్నించినప్పుడు, భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నడూ దళారీ దేశంగా వ్యవహరించదని జైశంకర్ వ్యాఖ్యానించారు.

## కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

మొదటి తరువాయి

తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.

## మీరేమైనా రాజులా... ఎందుకీ నిర్లక్ష్యం

మొదటి తరువాయి

ఈ కేసులో హరియాణా తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాల నుంచి రక్షణ(పోక్సో) చట్టంలోని సెక్షన్ 6(నేరం రుజువైతే 20ఏళ్ల జైలుశిక్ష) నుంచి నేరాన్ని సెక్షన్ 10(పదేళ్ల జైలుశిక్ష)కి ఎందుకు కుదించారని ధర్మాసనం నిలదీసింది. బాలల సంక్షేమ కమిటీ నివేదిక ఆధారంగా అభియోగాలను మార్చినట్టు భాటి సమాధానమివ్వగా.. బాలిక వాంగ్మూలం కంటే ఆ నివేదికకు ఎందుకు ప్రాధాన్యమిచ్చారని ప్రశ్నిస్తూ.. అసమర్థమైన విషయాన్ని సమర్థించవద్దని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీసీపీ, ఏసీపీ హోదా కలిగిన పోలీస్ అధికారులు ఈ విచారణలో భాగమయ్యారు. ఆ చిన్నారిపై జరిగిన నేరం గురించి వారి అవగాహన ఇదే అయితే, మరి చట్టబద్ధమైన పాలన సంగతేంటి? అత్యాచారం అంటే లైంగిక చొరబాటు మాత్రమే కాదు. ఈ విషయంలో పోలీసులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. నేర తీవ్రతను తగ్గించేందుకే అత్యున్నత పోలీస్ అధికారులను రంగంలోకి దించారు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. పోలీసులు కనీసం చట్టాన్ని చదవలేదు. నాలుగేళ్ల చిన్నారి నిర్దోషిత్వాన్ని నమ్మలేదు. వారికి సిగ్గుండాలి. రాష్ట్రానికి చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, వారిని తక్షణమే బదిలీ చేయాలి. సీసీటీవీ కెమెరాలు లేవని చెబుతున్నారు. 15 రోజులుగా ఏమీ చేయకుండా.. మేమీ కేసును పరిగణనలోకి తీసుకున్నాకే అరెస్ట్‌లు మొదలెట్టారు. మీరెందుకంత తీరిక లేకుండా ఉన్నారో మేమే చెప్పాలా? ఈ కేసు సున్నితత్వం లేమికి పరాకాష్టగా నిలుస్తోంది. సీడబ్ల్యూసీ సభ్యులు ఎవరు? వారిని ఎవరు నియమిస్తారు? వారి అర్హతలేమిటి?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసు నమోదులో భాగంగా అఫిడవిట్‌లో పలుమార్లు ఆ చిన్నారి పేరు ప్రస్తావించడంపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గురుగ్రామ్ పోలీసులు నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన, పూర్తిగా చట్టవిరుద్ధమైన దర్యాప్తు విధానాన్ని కొనసాగించారని.. ఈ తీరుతో ఆ చిన్నారి మరింత మానసిక క్షోభకు గురై ఉంటుందని అభిప్రాయపడింది.

## ప్రాజెక్టు కుశ పరీక్ష సక్సెస్

**ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే దీని లక్ష్యం**



**న్యూఢిల్లీ,**
రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన దీర్ఘశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ 'ప్రాజెక్టు కుశ' తొలి అభివృద్ధి పరీక్షలను భారతదేశం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ వ్యవస్థను మూడు అంచెల ఇంటర్‌సెప్టర్ క్షిపణి అమరికతో రూపొందించారు.ఇది 150 కి.మీ నుంచి 450 కి.మీ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే లక్ష్యంగా దీనిని రూపొందించారు.

# కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా

మొదటి తరువాయి

జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాలుగు పేజీల రాజీనామా లేఖను కార్యకర్తల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తానంటూ శపథం చేశారు. తనను నమ్ముకున్న అనుచరులకి పదవులు రాకపోతే పార్టీలో కొనసాగడం అవసరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలోనూ తాను న్యాయవాదిని అయినా పట్టించు కోలేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలని హింసించి కొట్టించినవారిని గద్దేనెక్కిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మాది అన్న ఫీలింగ్ మావారికి లేదని.. గాంధీభవన్‌లో ఫిరాయింపుల ఎమ్మెల్యే ఉంటే సమావేశంలో ఎలా పాల్గొంటారన్నారు. రాహుల్ గాంధీ ఫాంచ్ న్యాయ్ అని రాజ్యాంగం పట్టుకొని తిరుగుతే ఇక్కడ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారన్నారు. ఈ వయస్సులో నేను పార్టీ మారి ఎం చేస్తాను. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చితే నేను ఎలా భరిస్తాను. నేను ఇరవై మాసాలు ఓపిక పట్టాను. కాంగ్రెస్ పార్టీలో నన్ను అడుక్కునే స్థాయికి పట్టుకొచ్చారు. మీనాక్షి నటరాజన్ ఎనభై శాతం సీట్లు నాకే ఇస్తామని మాట ఇచ్చారు.. ఆ మాట పట్టించుకోలేదు. నాకు టికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతాడు. పదవులు కావాలనుకుంటే నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాడిని. పీసీసీ అధ్యక్షుడు కావాల్సి నోడిని నా హక్కుల కొసం పోరాటం చేసే పరిస్థితి వచ్చింది. జీవన్ రెడ్డి అణగదొక్కాలన్నదే మీ ఆలోచన. చంద్రబాబు, కేసీఆర్‌ల మీద పోరాటం చేశాను.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తాను. అడుగులకి మడగులు ఒత్తేటోళ్ళే మీకు కావాలా? రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వాణ్ని అణగదొక్కారు. బతకవచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం సహహోదారుడా? పోచారం ఇప్పటివరకు ఏం సలహాలు ఇచ్చాడని సీనియర్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో రాహుల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ప్రవర్తిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. హైకమాండ్ తీరు, పార్టీలోకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తీసుకున్న కారణంగానే మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టార్జితమని.. పదేళ్లు తమను ఇబ్బంది పెట్టిన వారిని తీసుకువచ్చి పార్టీలో చేర్చుకుంటారా? అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్ణయాలు జాతీయస్థాయిలో ప్రభావితం చూపబోతున్నాయని.. 'జై భీమ్–జై సంవిధాన్–జై బాపు' నినాదాలకు తూట్లు పొడిచారంటూ విమర్శించారు. కాంగ్రెస్‌ను వీడటం బాధగా ఉన్నా తప్పడం లేదంటూ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వివరించారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

మొదటి తరువాయి

ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్జడెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

# దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

మొదటి తరువాయి

నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్ళెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్‌పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్‌పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి.

మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశిరచిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్‌పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉ

# తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

మొదటి తరువాయి

నగర వ్యాప్తంగా చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ప్రజలు మరింతగా ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ కొరతతో ఇబ్బందులు తప్పవన్న వదంతులే ఇందుకు కారణం. అయితే, దీనిపై తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింద్గి÷లంగాణలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపింది. రాష్ట్ర ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. పీఆర్ఎస్వో(ఖఖాక్ష)లకి విరుద్ధంగా ప్రజలు, బంకుల యాజమాన్యాలు ప్రవర్తించవద్దని చెప్పింది. అవసరాన్ని బట్టి మాత్రమే పెట్రోల్, డీజిల్ కొనాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సప్లయ్ చైన్స్ సరిగ్గా పని చేస్తున్నాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపింది. మరోవైపు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(ఃఖఅఒ) అడ్వైజరీ జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా నిరాధారమైనవని తెలిపింది. భారతదేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా సరఫరా నడుస్తోందని.. బీపీసీఎల్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని అడ్వైజరీలో తెలిపింది. పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారుల ఆందోళన నేపథ్యంలో తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పందించింది. పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో తప్పుడు ప్రచారాల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకులను పరుగులు తీస్తూ, ట్యాంకులు నింపుకుంటున్నారని తెలిపింది. ఈ భయాందోళనల కారణంగా సాధారణ స్థాయి కంటే 2.5 నుంచి 3 రెట్లు అధికంగా అమ్మకాలు జరుగుతు న్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలి కంగా ఇంధన నిల్వలు తగ్గినట్లు కనిపిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని స్పష్టంచేసింది. ఊఖఅఒ, ఎక్షఅఒ, ఃఖఅఒ సంస్థల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుందని తెలిపింది. పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని.. ఇది ఖఇ÷ూక్ష నిబంధనలకు విరుద్ధమని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇంధనాన్ని తప్పుగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం తెలిపింది. భయాందోళనలతో అధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించింది.

# పెట్రోల్ డీజిల్ తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధి నిల్వలు

- సోషల్ మీడియా పుకార్లు నమ్మొద్దు
- ప్రపంచం మొత్తం ఆయిల్ కొరత ఉంది కానీ భారత్ లో లేదు
- మన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ముందు చూపుతో
- ప్రపంచం మొత్తం దేశాలలో ఆయిల్ ధర పెరిగింది కానీ భారత్ లో పెరగలేదు
- కొత్తూరు మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు ఎర్రవెల్లి నాగరాజు చారి



**కొత్తూరు 25 మర్చి నేటి దర్శిని ప్రతినిధి**
దేశంలో డీజిల్ పెట్రోల్ కొరత లేదని హెచ్పీసీఎల్,బిపిసిఎల్,ఐఓసి డీలర్లకు ఓడి ఫెసిలిటీ తీసేయడం నగదు రూపంలో కొనుగోలు చేయాలని కంపెనీ తెలియజేయడం వల్ల డీలర్లు 20 రోజుల క్రెడిట్ ఫెసిలిటీని తొలగించడం వల్ల డీలర్ కొద్దిగా వారికి డబ్బులకు ఇబ్బంది పడడం ఈ సమస్య వచ్చిందని దేశంలో ఆయిల్ నిల్వల కొరతలేదని భారతీయ జనతా పార్టీ కొత్తూరు మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు ఎర్రవెల్లి నాగరాజు చారి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎటువంటి వదంతులు నమ్మకండి దేశంలో డీజిల్ పెట్రోల్ కొరత లేదని మరొకసారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కొందరు పనిగట్టుకొని కృత్రిమ కొరత సృష్టించి మన ప్రియతమ ప్రధానిని శ్రీ నరేంద్ర మోడీని బదలాం చేయాలని వారు ప్రయత్నం చేస్తున్నారు.అది ఎన్నటికీ నెరవేరదు దేశ సమైక్యతను దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అందరూ సమన్వయం తో ఉండాలని ప్రజలను కోరుతున్నాం అని బిజెపి పార్టీ మాజీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజ్ చారి అన్నారు.

# పెట్రోల్ బంకుల్లో నో..స్టాక్ బోర్డు దర్శనం

- వాహనదారులు అవస్థలు



**మిడ్జిల్ మార్చి 25( నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల కేంద్రంలో ఇటీవల పెట్రోల్ కొరతపై వినిపిస్తున్న వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పెట్రోల్ నిల్వలు లేవనే వదంతులు వేగంగా వ్యాపించడంతో మండలంలోని వాహనదారులు బుధవారం పెద్ద ఎత్తున పెట్రోల్ పంపుల వద్దకు తరలివస్తున్నారు. దీంతో పంపుల వద్ద భారీ క్యూలు ఏర్పడి, సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాస్తవ పరిస్థితిని పక్కనపెట్టి వదంతులను నమ్మడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. కొంతమంది అవసరానికి మించిన నిల్వ చేసుకోవాలనే ఆలోచనతో పెట్రోల్ తీసుకోవడం వల్ల నిజంగా అవసరం ఉన్న వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ తరహా పరిస్థితులు కృత్రిమ కొరతకు దారి తీసే ప్రమాదం ఉంది. సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, మండలంలోని పెట్రోల్ నిల్వలపై స్పష్టత ఇవ్వడం అత్యవసరం. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వదంతులను నమ్మవద్దని సూచనలు చేయాలి. అదే విధంగా పెట్రోల్ పంపుల యాజమాన్యాలు కూడా సరఫరా పరిస్థితులపై స్పష్టమైన సమాచారం ప్రదర్శించడం ద్వారా గందరగోళాన్ని తగ్గించవచ్చు.ప్రజలు కూడా బాధ్యతతో వ్యవహరించి, అవసరానికి మాత్రమే ఇంధనం వినియోగించడం మంచిది. వదంతులకు లోనుకాకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. సమన్వయంతో వ్యవహరిస్తే ఇలాంటి పరిస్థితులను సులభంగా నియంత్రించవచ్చు.

# ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టులపై ఆగ్రహం

- బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్



**దేవరకొండ, మార్చి 25 నేటి దర్శిని ప్రతినిధి :**
రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకులపై నమోదవుతున్న అక్రమ అరెస్టులను ఖండిస్తూ దేవరకొండలో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బుడిగా వెంకటేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. అరెస్టైన రాష్ట్ర అధ్యక్షుడు సహా అన్ని నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రస్తుతం పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. భవనాలు, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, హాస్టళ్లు సరిపడా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల ఖాళీలు అధికంగా ఉండటం వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 8,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమస్యలపై నిర్వహించిన శాంతియుత చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.గత బడ్జెట్‌లో విద్యకు కేవలం 7.56 శాతం మాత్రమే కేటాయించడం వల్ల యూనివర్సిటీల్లో సదుపాయాల కొరత, సిబ్బంది లోపం పెరిగిందని తెలిపారు. టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్య సమస్యలను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోర రోహన్, నాగిళ్ల కార్తీక్, ఆంబోతు గణేష్, ముసుకు గణేష్, ముదిగొండ రాఖిల్, ఉరే లక్ష్మీ ప్రశాంత్, మనోహర్ తదితరులు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు ప్రజలు ఆందోళన చెందవద్దు

- మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఐపిఎస్




మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఐపిఎస్

**మిడ్జిల్,మార్చి 25, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డీ.జానకి ఐపీఎస్, తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ప్రజలకు విజ్ఞప్తి. రాష్ట్రంలో ఇంధన కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం.రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. సరఫరా ఎక్కడా ఆగలేదు, నిరంతరాయంగా జరుగుతోంది.HPCL, IOCL, BPCL కంపెనీల నుండి బంకులకు సరఫరా నిరంతరాయంగా జరుగుతోంది. ఎక్కడా సరఫరా ఆగలేదు. కొరత ఉందన్న భయంతో ప్రజలు ఒక్కసారిగా బంకులకు రావడం వల్లే రద్దీ పెరుగుతోంది. దీనివల్ల కొన్ని బంకుల్లో స్టాక్ త్వరగా అయిపోతోంది తప్ప, అది అసలైన కొరత కాదు. పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాల్లో, క్యాన్లలో నింపి ఇళ్లలో దాచుకోవడం చట్టవిరుద్ధం (గ్రాజుూరా నిబంధనల ప్రకారం) మరియు చాలా ప్రమాదకరం. దీనివల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కావాలని పెట్రోల్, డీజిల్, కొరత ఉన్నట్లు సృష్టించినా లేదా సోషల్ మీడియాలో పుకార్లు ప్రచారం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము.మీకు ఎంత అవసరమో అంతే పోయించుకోండి. అనవసరంగా స్టాక్ చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించకండి. తప్పుడు వార్తలను నమ్మకండి, బాధ్యతగా ఉండండి. అనవసరంగా భయపడకండి.

# వరంగల్‌లో వాతావరణ మౌలిక సదుపాయాల లోటుపాట్లపై.....

- లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య
- వరంగల్‌లో ప్రత్యేక వాతావరణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- లోక్‌సభలో వరంగల్ ఎంపీ డిమాండ్



**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లాలో ఆధునిక వాతావరణ పర్యవేక్షణ సదుపాయాల్లో ఉన్న లోటుపాట్లను వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. ఇటీవలి కాలంలో తీవ్ర వాతావరణ మార్పులు పెరుగుతున్న నేపథ్యంలో, జిల్లాలో తగిన స్థాయి వాతావరణ మౌలిక సదుపాయాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని ఎంపీ పేర్కొన్నారు.ఈ అంశంపై స్పందించిన భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 5 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు, వర్షపాతం కొలిచే గేజ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే, వరంగల్‌లో డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్న రాడార్ల ద్వారా వరంగల్ ప్రాంతానికి సేవలు అందుతున్నాయని చెప్పారు. అలాగే, వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా వరద హెచ్చరిక కేంద్రం లేకపోయినా, సమీప జిల్లాల్లో ఉన్న కేంద్రాల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని కేంద్రమంత్రి వివరించారు.దీనిపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పందిస్తూ, ఇతర ప్రాంతాలపై ఆధారపడటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనలో లోపాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా స్థాయిలోనే ఖచ్చితమైన వాతావరణ అంచనాలు, మెరుపు హెచ్చరిక వ్యవస్థలు, క్లైమేట్ రెసిలియెన్స్ మెకానిజంలను బలోపేతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్రాన్ని కోరారు.ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న అలర్ట్ వ్యవస్థలు, 'మిషన్ మౌసమ్' వంటి కార్యక్రమాలు ఉన్నప్పటికీ, వరంగల్ వంటి సున్నిత ప్రాంతాల కోసం ప్రత్యేక పెట్టుబడులు అవసరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎంపీ స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ముందస్తు చర్యలు, సమగ్ర విపత్తు నిర్వహణ వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

# ఉమ్మడి నల్లగొండ సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా లపంగి నర్సింహ

- గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ



**మర్రిగూడ, మార్చి 25 నేటి దర్శిని ప్రతినిధి :**
తెలంగాణ సర్పంచుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ, సర్పంచుల సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల అభివృద్ధికి నర్సింహ సమర్థంగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు లపంగి నర్సింహ కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులను ఏకం చేసి, వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ నియామకంపై రాంరెడ్డిపల్లి గ్రామస్థులు, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# హయత్‌నగర్‌లో ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ మహోత్సవం



**హయత్‌నగర్, మార్చి25 (నేటి దర్శిని):**
లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నిర్మితమవుతున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, శాంతి కళ్యాణం వంటి పలు పుణ్య కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిపారు.
ఈ కార్యక్రమాలలో కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, భక్తుల గోవింద నామస్మరణలతో ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తూ సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రతి ఇంట్లో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన దేవస్థాన నిర్మాణ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘం, కాలనీ వాసుల సేవలను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## సంపాదకీయం

# ఆయిల్ సంక్షోభంలో భారత్ !



మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారత్‌లో కరోనాలాంటి దుర్భర పరిస్తితులు రాబోతు న్నాయని ప్రధాని మోడీ చేసిన హెచ్చరిక మనం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితిని సూచిస్తోంది. ఎందుకంటే గల్ఫ్ ఆయిల్ దక్కితే తప్ప ఇక్కడ బండి నడవని పరిస్థితులు ఉన్నాయి. దేశీయంగా మనం గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నా... సోలార్ విద్యుత్ పొందుతున్నా మనమింకా స్వయం సమృద్ధి సాధించలేక పోయాం. ఇప్పుడిప్పుడే సోలార్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాం. అయితే ఆయిల్‌కు ప్రత్నమ్నాయంగా మనం ఎదగడం లేదు. నేచరల్ గ్యాస్ లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చమురు వినియోగంలో రవాణా రంగానిది ప్రథమ స్థానం. రవాణా కార్యకలాపాలలో సహజవాయువు వినియోగం ఆశించిన విధంగా పెరగలేదు. రైల్వేస్‌లో సైతం డీజిల్ వినియోగం ఎక్కువే అయినా 90శాతానికి పైగా రైల్వే లైన్లు విద్యుదీకరణ కావడంతో ఆ చమురు వినియోగం 62శాతానికి తగ్గింది. విద్యుదుత్పాదనలో సహజవాయువుకు ప్రాధాన్యం అంతకంతకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతుల సాగు బావులకు విద్యుత్ పంపు సెట్లు అందించడం ద్వారా గ్రామీణ విద్యుత్ సరఫరాకు ఊతమివ్వడం డీజిల్ వినియోగాన్ని తగ్గించడంలో భాగమే. అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ పంపుసెట్లు ఇప్పటికీ డీజిల్‌పై ఆధారపడి ఉండగా ఎరువుల కర్మాగారాలు గ్యాస్ ఆధారితంగా ఉన్నాయి. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు సైతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతున్నాయన్న విషయం విస్మరించలేనిది. ఇరాన్‌తో యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందా అన్నది కూడా సందేహంగానే ఉంది. ట్రంప్ మూర్ఖత్వంపైనే యుద్ధం ముగింపు ఆధారపడి ఉంది. వెనిజులాను చెరపట్టినట్లుగా ఇరాన్‌ను చెరపట్టవచ్చన్న ట్రంప్ ఎత్తుగడలు ఫలించలేదు. ట్రంప్ అంచనాలు తలికిందులు అయ్యాయి. ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. వెంటనే ముగిసినా దాని తాలూకు నష్టాలు భరించి ముందుకు వెళ్లడానికి కనీసం ఓ ఐదారు నెలలు పడుతుంది. ఈ దశలో ఆయిల్ వాడకాలు తగ్గించుకోవడం మంచిది. దేశీయ ఉత్పత్తులను మాత్రమే వాడాలన్న నిబంధన రావాలి. దేశీయ వస్తువులను వాడేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలి. రైతులు పండించే పంటలకు తోడు,దేశానికి అవసరమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలి. దిగుమతులను తగ్గించు కోవడం లేదా నిలిపి వేయడం అసవరం. మధ్యప్రాచ్య దేశాలలో తరచూ యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనడం పరిపాటి. ఈ దేశాల చమురు ఉత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు, మరీ ముఖ్యంగా భారత్ యుద్ధ పరిస్థితులు తలెత్తిన ప్రతిసారీ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది. ఇప్పుడూ అదే జరుగుతోంది. అరబ్ దేశాలు, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఉత్పన్నమైన ప్రతిసారీ చమురు ధరలు పెరుగుతాయి. వెనువెంటనే ద్రవ్యోల్బణం ముమ్మరమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి విఘాతం వాటిల్లుతుంది. రాజకీయ అంశాలకు తోడుగా సైనిక సమీకరణలు, దౌత్య వ్యవహారాల విభిన్న సవాళ్ళ మధ్య భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు దౌత్యపరంగా భారత్ తడబాటు లేకుండా నెగ్గుకు వస్తోంది. ఎక్కడ తప్పటడుగు వేసినా భారత ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించు కోవల్సివస్తుంది. గోరుచుట్టుపై రోకటిపోటులా తాజా యుద్ధం కారణంగా చమురు ధరల పెరుగుదల, అలభ్యత వంటి ప్రతికూల పరిస్థితులలో భారత్ దెబ్బతింటోంది.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇప్పటికే దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ పరిణామాలను గమనిస్తుంటే ఇదంతా ప్రపంచ వినాశనానికి దారితీసేలా ఉంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు చెలరేగిన ప్రతిసారీ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో వస్తున్న ఒడిదుడుకుల దృష్ట్యా భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా బొగ్గు ఉత్పత్తిని పెంచింది. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి ఇతోధికమయిన కారణంగా చమురు, సహజ వాయువు అవసరాలు మున్నెన్నడు లేని విధంగా పెరిగిపోయాయి. వాటి దిగుమతులపై ఆధారపడడమూ అనూహ్యంగా పెరిగిపోయింది. కీలకమైన విద్యుత్ ఉత్పత్తి రంగంలో కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ క్రమేణా సహజవాయువు వినియోగాన్ని అధికం చేశారు. అయితే విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్న సహజవాయువు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదే కావడం గమనార్హం. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది దిగుమతి చేసుకుంటున్న చమురు ధరలపై ఆధారపడి ఉన్నది. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురును స్థానిక విపణిలో విక్రయించకుండా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అరేబియా సముద్ర తీరస్థ ఎనిమిది దేశాలు భారత్‌కు చమురు సరఫరా చేస్తున్నాయి. అదే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ ఆధిపత్య ధోరణితో వ్యవహరించే ఆ ఒక్క దేశంపై మాత్రమే ఆధారపడవల్సి ఉంటుంది. అయితే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసినా ముప్పు తప్పేలా లేదు. రేపు మరెలాంటి ముప్పు వస్తుందో చెప్పలేం. అందువల్ల భారత్ స్వయం సమృద్ధి దిశగా అడుగుల వేయాలి. ప్రజలను అందుకు సన్నద్ధం చేయాలి.

# అస్పష్టమైన భయాందోళనే ఇది !

- వందేమాతరంపై హోం శాఖ సర్క్యులర్‌పై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం



న్యూఢిల్లీ,- మార్చి 25 నేటి దర్శిని

ప్రజా కార్యక్రమాల్లో వందేమాతరాన్ని సంపూర్ణంగా ఆలపించాలని పేర్కొంటూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జనవరి 28న జారీ చేసిన మార్గదర్శకాలు ఎవరికీ ముప్పు కలిగించేవి కావని, అలాగే రాజ్యాంగ స్వేచ్ఛలకు భంగకరం కూడా కావని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది.
ఇవి ఎవరికీ ముప్పు కలిగించేవి కావు, కేవలం సూచనలు మాత్రమే. జాతీయ గీతం అంటే జాతీయ గుర్తింపును వ్యక్తీకరించడమని మంత్రిత్వ శాఖ భావించింది. కానీ మీకు భిన్న అభిప్రాయం వుండొచ్చు, అయితే, మీరు అస్పష్టంగా భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని మేం భావిస్తున్నాం. ఈ సూచనలు ఆధారంగా ఎవరైనా మిమ్మల్ని వివక్షకు గురి చేసినట్లైతే మీరు వెంటనే మా వద్దకు రావచ్చు." అని జస్టిస్ జోమాల్యా బాగ్చి పిటిషనర్ మహ్మద్ సయీద్ నూరిని ఉద్దేశించి పేర్కొన్నారు. జాతీయ గీతాన్ని ఆలపించని వారు శిక్షను అనుభవిస్తారని, లేదా తీవ్ర చర్యలు తీసుకుంటారని సర్క్యులర్ ఎక్కడా లేదని త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. 'శిక్ష లేకపోయినా, చట్టపరమైన ఆంక్షలు లేకపోయినా ఈ గీతాన్ని ఆలపించడానికి నిరాకరించినా లేదా నిలుచోకపోయినా వారిపై అపారమైన భారం వుంటుందని పిటిషనర్ వాదించారు. "ఏమిటి ఆ భారం ? జాతీయ గీతాన్ని ఆలపించేటపుడు మీరు పాడలేదని, లేదా నిలబడలేదని పేర్కొంటూ అందుకు ప్రతిఫలంగా మీరు సంస్థను మూసివేస్తాం లేదా గుర్తింపు రద్దు చేస్తామని ఎవరైనా మీకు నోటీసులు పంపినట్లైతే మేం అర్థం చేసుకోగలం" అని చీఫ్ జస్టిస్ స్పందించారు. వాదనలు విన్న అనంతరం ఈ పిటిషన్‌ను అపరిపక్వమైనదిగా పేర్కొంటూ ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.

# ఇక చంద్రునిపై శాశ్వత నివాసం

- ప్రతి నెలా చంద్ర యాత్రలు... 2029 నాటికి అంతరిక్ష కేంద్రం ప్రారంభం లక్ష్యం



న్యూఢిల్లీ,- మార్చి 25 నేటి దర్శిని

అంతరిక్ష అన్వేషణలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతూ, అమెరికా అంతరిక్ష సంస్థ నాసా సంచలన ప్రణాళికలను ప్రకటించింది. ఇక చంద్రుడిపై కేవలం అడుగుపెట్టడమే కాదు... అక్కడే మానవులు నివసించే యుగానికి శ్రీకారం చుడుతోంది. భూమి వెలుపల శాశ్వత మానవ నివాసం కలను నిజం చేయాలనే లక్ష్యంతో నాసా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో అత్యాధునిక పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం తరహాలో, ప్రతి ఆరు నెలలకు వ్యోమగాములను చంద్రుడిపైకి పంపే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఇంకా ముందుకు వెళ్తుతూ, 2027 నుంచి ప్రతి నెలా చంద్రయాత్రలను నిర్వహించాలనే లక్ష్యాన్ని నాసా పెట్టుకుంది. ఈ ప్రయాణాల కోసం ప్రైవేట్ కంపెనీల సహకారంతో రోవర్లు, ల్యాండర్లు పంపనున్నారు. సుమారు రూ. 1.82 లక్షల కోట్లు (20 బిలియన్ డాలర్ల) వ్యయంతో ఈ భారీ ప్రాజెక్టును మూడు దశల్లో అమలు చేయనున్నారు.
మొదటి దశ: పరీక్షల కోసం అవసరమైన పరికరాలు, రోవర్లను చంద్రునిపైకి పంపడం
రెండవ దశ:వ్యోమగాములు నివసించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు
మూడవ దశ:దీర్ఘకాల నివాసానికి అవసరమైన శాశ్వత వ్యవస్థల నిర్మాణం 2029 నాటికి ఈ కేంద్రం ప్రాథమిక కార్యకలాపాలు ప్రారంభమవుతాయని నాసా వెల్లడించింది. తమ లక్ష్యం కేవలం చంద్రుడిపై జెండా పాతడమే కాదని, అక్కడే మానవ జీవనాన్ని స్థాపించడం అని నాసా నిర్వాహకుడు జారెడ్ ఐజాక్‌మన్ స్పష్టం చేశారు.

# సిలిండర్లు ఖాళీ... వాగ్దానాలు గాలికి


- ఇంధన నిల్వలపై కేంద్రం అబద్ధాలు
- ఎల్పిజి సంక్షోభంపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆందోళన




న్యూఢిల్లీ,- మార్చి 25 నేటి దర్శిని

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం నేపథ్యంలో దేశంలో ఎల్పిజి సరఫరా సంక్షోభంపై ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మకరద్వార్ వద్ద ప్రతిపక్ష ఎంపిలు 'సిలిండర్లు ఖాళీ...వాగ్దానాలు ఖాళీ' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌తో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎన్సిపి ఎంపి సుప్రియా సూలే, ఎస్పి ఎంపి ధర్మేంద్ర యాదవ్, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, సిపిఐఎంఎల్ ఎంపి సుదామ ప్రసాద్, డిఎంకె ఎంపి టి.సుమతి, జెఎంఎం ఎంపి మహువా మాజీ, ఆర్జెడి ఎంపి మీసా భారతి, శివసేన ఎంపి అరవింద్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం అబద్ధాలు చెబుతుందన్నారు. గ్రామాలు, నగరాల్లో గ్యాస్ కొరత తీవ్రంగా కన్పిస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్పిజి సంక్షోభంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తనతో తానే చర్చలు జరుపుకుంటున్న అమెరికా : ఇరాన్ ఎద్దేవా



దుబాయ్,న్యూఢిల్లీ,- మార్చి 25 నేటి దర్శిని

అమెరికా-ఇరాన్ చర్చలపై ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ సైన్యం కొట్టిపారేసింది. కాల్పుల విరమణ ఒప్పందం కోసం అమెరికన్లు వారితో వారే చర్చలు జరుపుకుంటున్నారని ఇరాన్ సైనిక ప్రతినిధి ఎద్దేవా చేశారు. ఇరాన్ మిలటరీ ప్రధాన కార్యాలయం 'ఖాతమ్ అల్-అన్బియా' ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జుల్ఫఘరి రికార్డింగ్ వీడియో ఒకటి బుధవారం ప్రభుత్వ అధికారిక మీడియాలో ప్రసారమైంది. ఆ వీడియోలో ఆయన అమెరికా చర్చలపై ఘాటుగా స్పందించారు. "మీరు తరచుగా ప్రస్తావించే 'వ్యూహాత్మక శక్తి' ..ఇప్పుడు ఒక 'వ్యూహాత్మక వైఫల్యం'గా మారింది. తానే ప్రపంచ అత్యున్నత శక్తిగా చెప్పుకునే దేశం, సాధ్యమైతే ఈ చిక్కుముడి నుండి ఎప్పుడో బయటపడి ఉండేది. మీ ఓటమిని ఒక ఒప్పందంగా చిత్రీకరించకండి. మీ డొల్ల వాగ్దానాల శకం ముగిసిపోయింది" అని పేర్కొన్నారు. "మీ అంతర్గత సంఘర్షణలు, మీతో మీరే బేరసారాలు జరుపుకునే స్థాయికి చేరుకున్నాయా" అని ఎద్దేవా చేశారు. "మొదటి రోజు నుండి మా మొదటి, చివరి మాట అదే.. అది అలాగే కొనసాగుతుంది. మాలాంటి వారు మీ లాంటి వారితో ఎప్పటికీ రాజీపడరు.. ఎప్పటికీ" అని జల్ఫఘరి స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్‌కు 15 షరతుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని పంపిందన్న వార్త వెలువడిన కొద్ది సేపటి తర్వాత ఇరాన్ సైనిక ప్రతినిధి నుండి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

**DISSOLUTION OF PARTNERSHIP FIRM**

This is to infrom that the partnership firm **M/S Eksha Infra**, Having Registered Office @ 1-57/802/B, Situated at Sri Ram Nagar Colony,Kondapur,Hyderabad, Telangana-500084, 6580F2025 is registered under section 63(1) of the indian partnership act, 1932 read with the rule 1961 is dossolved the firm. Notice is hereby given that **M/S Eksha Infra** is dissolved with the effect from 26 day of March 2026

**M/S Eksha Infra**
**Partner**

# గృహాల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ను తొలగించండి!

● బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి



**మిడ్జిల్, మార్చి 25, (నేటి దర్శిని ప్రతినిధి):**
ఉర్కొండ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో లో నివాసాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ను మరొక చోటకు మారుస్తూ,రైతులకు ఓవర్ లోడ్ కింద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చెయ్యాలి అని ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. కరెంట్ విషయంలో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడడం బాధాకరం అన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ ఓర్స్. అలివేల ఆంజనేయులు ప్రయత్న పలితంగా కరెంట్ ఎఈ.ఎడి లతో ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి మాట్లాడారు. అనంతరం ఎడి వెంటనే స్పందించి, వారం రోజులలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లయ్య,కాంగ్రెస్ యువ నాయకులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సంత వేలంపై రగడ.. జనసేన నాయకుల అరెస్టు

● రైతుల పక్షాన ప్రశ్నించగా పోలీసుల చర్యలపై ఆగ్రహం




**కొండమల్లేపల్లి, మార్చి 25 నేటి దర్శిని ప్రతినిధి :**
కొండమల్లేపల్లి సంత వేలం అంశంపై ఉద్రిక్తత నెలకొంది. రైతుల సమస్యలపై అధికారులను నిలదీశారని జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కోర్ర చందు నాయక్, నాయకుడు కొత్తగొల్ల నరేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం వివాదాస్పదమైంది. 2015 నుంచి 2025 వరకు సంత వేలం సుమారు రూ.50 లక్షలకే కొనసాగగా, ఈసారి 2026 సంవత్సరానికి నిర్వహించిన వేలం రూ.3.80 కోట్లకు చేరడం అనుమానాలకు దారి తీస్తోంది. మండల కార్యదర్శి, సర్పంచ్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కల్వకుర్తికి చెందిన సుధాకర్ రెడ్డి ఈ మొత్తానికి సంతను దక్కించుకున్నట్లు సమాచారం. జనసేన నాయకుడు కోర్ర చందు నాయక్ మాట్లాడుతూ, రైతులకు న్యాయం జరగకపోవడంతో అధికారులను ప్రశ్నించగా పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించి స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. రైతుల తరఫున మాట్లాడినందుకు ఇలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. గత 15 సంవత్సరాలుగా సంత వేలంలో అవకతవకలు జరిగి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోయిందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం జరిగిన వేలంలో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంతలో రైతులకు తాగునీరు, భోజనం, భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని, చిట్టీ విధానంలో మార్పులు చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ప్రతి సంతలో రైతుల పక్షాన నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

# గురుకుల ప్రవేశ పరీక్షల్లో నిజాం నగర్ విద్యార్థుల ప్రతిభ పతాక

● 10 మందిలో 9 మంది గురుకులాల్లో సీట్లు సాధన



**దేవరకొండ డిండి, మార్చి 25 నేటి దర్శిని ప్రతినిధి :**
నల్గొండ జిల్లా డిండి (గుండ్లపల్లి) మండలం నిజాం నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల (ఎంపిపిఎస్) విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచారు. మంగళవారం విడుదలైన టిజి సెట్--2026 ఫలితాల్లో పరీక్ష రాసిన 10 మంది విద్యార్థుల్లో 9 మంది వివిధ గురుకులాల్లో సీట్లు సంపాదించి సత్తా చాటారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమరేందర్, ఉపాధ్యాయుడు రవి తెలిపారు. మారుమూల ప్రాంతానికి చెందిన చిన్న గ్రామపంచాయతీ పాఠశాల నుంచే ఇంతమంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం విశేషమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ వింజమూరి శశికళ శేఖర్ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందిస్తూ, కృషి, పట్టుదలతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. పరీక్ష రాసిన విద్యార్థుల్లో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

**అర్హత సాధించిన విద్యార్థులు:**
ఇ. మేఘన, ఇ. ప్రియదర్శిని, బి. ఇన్షిత, బి. ప్రవళిక (డిండి), బి. హేమశ్రీ (మల్లేపల్లి), ఇ. అశ్వంత్, కె. చరణ్ (కొమ్మేపల్లి), ఎం. సాత్విక్ (అనుముల), ఎం. దినేష్ (రాజపేట).

# ఈ-మొబిలిటీ విభాగంలో కేకేఎల్ గ్రూప్ తెలంగాణలో తొలి అడుగు





● హైదరాబాద్‌లో 'దండు'స్ ఈవీ కేకేఎల్ డీలర్‌షిప్ ప్రారంభం

**హైదరాబాద్, మార్చి25 (నేటి దర్శిని):**
ఈ-మొబిలిటీ రంగంలో అడుగుపెట్టిన 'కేకేఎల్ గ్రూప్' హైదరాబాద్‌లో తన తొలి డీలర్‌షిప్ 'దండు'స్ ఎలక్ట్రికల్ వెహికిల్స్'ను ప్రారంభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ, కేకేఎల్ హైటెక్ ఈవీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ డా. సి.ఎన్. గోపీనాథ్ రెడ్డి డీలర్‌షిప్‌ను ప్రారంభించారు. తెలంగాణ మత్స్యశాఖ చైర్మన్ ఎం. సాయికుమార్, కేకేఎల్ ఎండీ అడైకలం షణ్ముగం, డైరెక్టర్ డా. వెంకట కె. గంజాం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, దేశం క్లీన్ మొబిలిటీ వైపు వేగంగా కదులుతోందన్నారు. భారతదేశంలో అతి పిన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ.. ఈవీ మార్కెట్‌లో మంచి ఆసక్తి చూపుతోందని వివరించారు. ఉత్పత్తిదారులు, వ్యాపారులు, డీలర్లు, పరిశోధకులు కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. కేకేఎల్ తెలంగాణలో అడుగుపెట్టడం ద్వారా 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి బలం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక సరఫరాదారులతో కలిసి అన్ని వయసుల వినియోగదారులకు సరిపోయే ఈవీలను అందిస్తూ ప్రయాణ విధానంలో మార్పు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తెలంగాణలో తొలి మినీ ఈవీ డీలర్‌షిప్‌ను హైదరాబాద్‌కు చెందిన యువ పారిశ్రామికవేత్తలు నరేష్ దండు, రాజు దండు నిర్వహిస్తున్నారు. గాయత్రినగర్‌లో, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం సమీపంలో ఈ షోరూమ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేకేఎల్ ఎండీ అడైకలం షణ్ముగం మాట్లాడుతూ, భారత్‌లో ఈవీ వ్యాపారానికి విస్తారమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ద్విచక్ర వాహన రంగం బలంగా కొనసాగుతుందని, కంపెనీ వృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. భౌగోళికంగా ప్రత్యేక వ్యూహాలతో మార్కెట్ విస్తరణపై దృష్టిపెట్టామని చెప్పారు. వినియోగదారుల్లో నిల్వ డిమాండ్ పెరుగుతోందని అన్నారు. దేశంలో అతిపెద్ద ద్విచక్ర వాహన మార్కెట్లలో ఒకటైన తెలంగాణలో ఎలక్ట్రిక్ బైక్‌ల మార్కెట్ వేగంగా పెరుగుతోంది. హరిత రవాణా విధానాలకు రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. సాంకేతిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, వినియోగదారులకు అవగాహన పెరగడం ఈవీ వినియోగాన్ని పెంచుతున్నాయి. ప్రస్తుతం మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా కేవలం 1% మాత్రమే. అందులో ఎక్కువ భాగం ద్విచక్ర వాహనాలదే. ఈ పరిస్థితి కొత్త డీలర్‌షిప్‌లకు వ్యాపార అవకాశాలను కల్పిస్తోంది. కేకేఎల్ మోడళ్లు అన్ని వయసుల వారి అవసరాలను తీర్చడమే కాకుండా.. వాణిజ్య వినియోగదారులకు అధిక ఆదాయం అందించే సామర్థ్యం కలిగి ఉందని సంస్థ పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో ప్రతి నెలా ఐదు కొత్త డీలర్‌షిప్‌లు ప్రారంభించాలని కేకేఎల్ ప్రణాళిక రూపొందించింది. ద్విచక్రవాహనాల వినియోగం అధికంగా ఉన్న నగరాలపై కంపెనీ దృష్టిసారించింది. డీలర్‌షిప్‌లను వ్యక్తిగత డీలర్లు నిర్వహిస్తారు. మౌలిక వసతుల ఖర్చును వారు భరిస్తారు. ప్రచార ఖర్చును కంపెనీ, డీలర్ కలిసి పంచుకుంటారు. ప్రోత్సాహక పథకాల ద్వారా డీలర్లకు అదనపు లాభాలు అందిస్తారు. అమ్మకాల అనంతర సేవలు, విడిభాగాలు, యాక్సెసరీల విక్రయం కూడా డీలర్లకు ఆదాయవనరులుగా నిలుస్తాయి. సంస్థాగత, కార్పొరేట్ విక్రయాలపై కూడా ఈ సంస్థ దృష్టి పెట్టింది. తమిళనాడులోని సిర్కాళి కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేకేఎల్, దక్షిణ భారతదేశ వ్యాప్తంగా డీలర్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది. సూపర్ బైక్స్, స్కూటర్లు, ఆటో లోడర్లు, ప్యాసింజర్ ఆటోలు, మినీ కార్లు, బస్సుల్లాంటి విభిన్న మోడళ్లను అందిస్తోంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం నగరాల్లో డీలర్‌షిప్‌లను ప్రారంభించాలని రూపొందించింది. 2026 మే నాటికి 10 డీలర్‌షిప్‌లు ప్రారంభించి, ప్రతి డీలర్ నెలకు సుమారు 200 యూనిట్లు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నౌకల విక్రయం, సేవలు, ఈవీల అమ్మకాల్లాంటి విభాగాల్లో కేకేఎల్ గ్రూప్‌కు రెండు దశాబ్దాల అనుభవం ఉంది. 18కి పైగా ఓఈఎంలతో కలిసి 25 వేలకుపైగా ఈవీలను ఈ కంపెనీ విక్రయించింది. ఆటోమేషన్ ఇంజినీర్ అడైకలం షణ్ముగం నేతృత్వంలో సంస్థ అంతర్జాతీయస్థాయి సాంకేతికతను వినియోగిస్తూ ఉత్పత్తులు అభివృద్ధి చేస్తోంది. డైరెక్టర్ డా. వెంకట కె. గంజాం మాట్లాడుతూ, 2026-27లో దక్షిణ భారతదేశంలో వందకు పైగా డీలర్‌షిప్‌లు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రతి డీలర్ నెలకు 150 యూనిట్లు విక్రయించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. కంపెనీ అప్పులేమీ లేకుండా బలమైన ఆర్థిక స్థితిలో కొనసాగుతోందని డైరెక్టర్ అరుల్ శెట్టి వెల్లడించారు. కేకేఎల్ ప్రస్తుతం గ్రెటా, క్రెస్ట్, ఫించ్, స్పార్టన్, గ్రీన్ రైడర్, వెస్పర్ మోడళ్లను విడుదల చేసింది. ఈ వాహనాల ధరలు రూ.50,000 నుంచి రూ.1,50,000 వరకు ఉన్నాయి. లిథియం అయాన్ బ్యాటరీలతో ఆధునిక ఫీచర్లను అందిస్తున్నాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ ఫైజల్ అహ్మద్ మాట్లాడుతూ, అమ్మకాల అనంతర సేవలు, విడిభాగాలను త్వరితంగా అందించడం, తేలికపాటి బ్యాటరీలు వినియోగించడం ద్వారా వినియోగదారుల సంతృప్తిని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు సందర్శించండి: ఌఌఌ.ఎనెశ్రీప్రబ్రవఎష్ట్రవజ.ఎశీవ మీడియా అవసరాలకు సంప్రదించండి: సుదర్శన్ డి, 92463 71566

# ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కు



**ఎల్.బి.నగర్, మార్చి25 (నేటి దర్శిని):**
మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సెంట్రల్ బ్యాంక్ కాలనీలో నివసిస్తున్న షేక్ రుమాన్ మెహది (16) చెవి వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో చికిత్స కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, బాధితుడి తండ్రి షేక్ అలీపాషా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి గారిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి, బాలుడి శస్త్రచికిత్సకు అవసరమైన ఖర్చుల వివరాలను సేకరించి, ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దీనికి అనుగుణంగా రూ.6,00,000 (ఆరు లక్షల రూపాయలు) విలువైన ఎల్.ఓ.సీ చెక్కు మంజూరు కావడంతో, ఆ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణలో సీఎం సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరి, సురేందర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# జి డబ్ల్యూ ఎం సి బడ్జెట్ రూ.1040.58 కోట్లు పాలకవర్గం ఆమోదం...!






**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ముసాయిదా బడ్జెట్ సమావేశం బుధవారం జి డబ్ల్యూ ఎం సి మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరం లో జరిగింది .2026, 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ,వ్యయ అంచనాలపై చర్చించారు. జి డబ్ల్యూ ఎం సి 2026 ,27 ఆర్థిక సంవత్సరానికి గాను రూపాయలు 1040.58 కోట్ల అంచనాలతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ను మెజార్టీ సభ్యులు అంగీకారం తెలపడంతో పాలకవర్గం బడ్జెట్ ను ఆమోదించింది .అకౌంట్స్ అధికారి అంచనాలను వెల్లడించారు. ఇందులో రూపాయలు 349.19 కోట్లు సాధారణ పన్నుల ద్వారా, రూపాయలు 685.20 కోట్లు గ్రాంట్ల ద్వారా , రూపాయలు 6.20 కోట్లు డిపాజిట్ల, అడ్వాన్సుల ద్వారా వస్తాయని అంచనా వేశారు. నగర అభివృద్ధి ,మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో కలెక్టర్, జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీం, కార్పొరేటర్లు అధికారులు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశం ప్రశాంతంగా నిర్వహించుకునేలా రాజకీయ పార్టీల ఘర్షణ జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణం పోలీసులు భారీగా మోహరించారు.

# జనగామ ఇళ్ల సమస్యపై అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

- అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ప్రభుత్వాన్ని నిలదీత
- 800 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు నిధులు విడుదల చేయాలి
- స్లాబ్ దశలో నిలిచిన ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి
- ఎల్1, ఎల్3 జాబితాలపై స్పష్టత ఇవ్వాలి
- వాహనం ఉన్నా అర్హత రద్దు చేయడం సరికాదు
- ఎండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే డిమాండ్




**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాజనగామ పట్టణంలోని అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యపై బుధవారం ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో గళం వినిపించారు. గతంలో నిర్మాణం ప్రారంభమైన ఇళ్లను పూర్తిచేయ కుండా వదిలేయడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. పట్టణంలో నిర్మాణం లో ఉన్న 800 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసేందుకు తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్లాబ్ దశలో నిలిచిపోయిన ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హుల ఎంపికలో ఉన్న లోపాలను ప్రస్తావించారు. ఎల్1, ఎల్3, జాబితాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వాహనం ఉన్న కారణంతో అర్హతను రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పెండిం గ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు. జనగామ పట్టణంలో గత ప్రభుత్వ కాలంలో నిర్మించిన 800 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిపాటి నిధులు విడుదల చేస్తే ఆ ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందనీ,

బచ్చన్నపేట మండలం కేసిరెడ్డి పల్లి గ్రామంలో కొంతమంది ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉందన్నారు. వరంగల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి కి ఈ సమస్యను వివరించినట్లు చెప్పారు. మంత్రి కలెక్టర్‌కు సూచనలు చేసినప్పటికీ, కలెక్టర్ మార్పు కార ణంగా ప్రక్రియ ఆలస్యమైందన్నారు.

ఎన్నికల ముందు ఇళ్ల పూర్తి కోసం ప్రక్రియ ప్రారంభమైనా మధ్యలోనే నిలిచిపోయిందనీ, కొంతమంది లబ్ధిదారులు అనుమతి, అల్లాట్మెంట్ లేకుండా ఇళ్లలో నివసిస్తున్న పరిస్థితి ఉందనీ, కొన్ని ఇళ్లు స్లాబ్ దశలో ఉండి, స్వల్ప పనులు మిగిలి ఉన్నాయని ఇప్పటికే నిర్మించిన ఇళ్లను వృథా చేయకుండా పూర్తి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అర్హుల ఎంపికలో లోపాలు ఉన్నాయని, ఎల్1 జాబితాలో పేరు లేకపోవడంతో ఇళ్ల మంజూరు నిలిపి వేస్తున్నారు అన్నారు. వృత్తి అవసరాల కోసం వాహనం ఉన్నా దాన్ని అర్హతకు అడ్డంకిగా చూపడం సరికాదనీ, ఎల్3లో ఉన్నవారిని ఎల్ 1లో లేరనే కారణంతో తిరస్క రించడం తప్పుఅనితెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆదేశాలు జారీ చేసి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని స్పష్టం చేశారు. ప్రతినియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తా మని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు ఇస్తామని చెప్పి, 3,24,536 ఇళ్లు మాత్రమే మంజూరు చేశారు. అందులో 2,62,468 ఇళ్ల నిర్మాణం ప్రారం భమైనట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులకు రూ. 12,500 కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో కేవలం రూ. 5,000 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 2,62,000కు పైగా ఇళ్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు చెల్లింపులు ప్రభుత్వం ఎలా సమకూరుస్తుందో స్పష్టత ఇవ్వాలని కోరా రు. ఈ సంవత్సరం ప్రకటించిన 3,500 ఇళ్లకే సుమారు రూ. 3,000 కోట్లు లోటు ఉందనీ, వచ్చే సంవత్సరానికి ఇళ్ల నిర్మాణానికి అవస రమైన నిధులు ఎలా సమకూర్చుతారో అని ప్రశ్నించారు.

## బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే నాగరాజు



**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):** కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు, బలహీన వర్గాల పార్టీ అని ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అసెంబ్లీలో పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వంలోనే పేదల సొంతింటి కల నిజమవుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించాలంటే సొంత ఇల్లు అవసరమని, ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇండ్లు అందిస్తూ వారికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు పేదల కళ్లల్లో కనిపించే ఆనందం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని అన్నారు. గృహప్రవేశ కార్యక్రమాల్లో లబ్ధిదారులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటోతో ఇళ్లలోకి ప్రవేశించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి కూడు, గూడు, నీడ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో అధికంగా దళితులు ఉన్నారని, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే స్థోమత లేని వారికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక ప్రైవేట్ కంపెనీ సహకారంతో 25 ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంగా ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్న నియోజకవర్గాలకు ఎక్కువ ఇళ్లు కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వర్ధన్నపేట ప్రజల తరపున ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):** వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం అరైవ్ ,ఆ లైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 31వ తేదీ వరకు కొనసాగే ప్రత్యేక అవగాహన డ్రైవ్ పై పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్ కలెక్టరేట్ వద్ద ఎస్ జి పి ఏ టి ఆధ్వర్యంలో పెన్షనర్ల ధర్నా



**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):** పెన్షనర్లను రెండుగా విభజించి హక్కులను హరించి వేయడం దారుణమని ఎస్ జి పి ఏ టి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధీర్ బాబు అన్నారు. వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పెన్షన్ వ్యాలిడేషన్ యాక్ట్ 2025 రద్దు చేయాలని కోరుతూ బుధవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు మెమోరాండం అందజేసి ప్రధానమంత్రికి పంపించాలని వారు కోరారు.

## శ్రీరామనవమి వేడుకలకు మంత్రి కొండా సురేఖకు కర్మన్ ఘాట్ ఆలయ కమిటీ ఆహ్వానం



**ఎల్.బి.నగర్, మార్చి 25 (నేటి దర్శిని):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో మార్చి 27, శుక్రవారం నిర్వహించబోయే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యురాలు కొండా సురేఖని ఆహ్వానించారు. జుబిలీ హిల్స్‌లోని మంత్రి నివాసంలో ఈ రోజు ఉదయం ఆలయ కార్యనిర్వహణాధికారి యన్. లావణ్య ఆధ్వర్యంలో చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు తోకటి కిరణ్ కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, జునుంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ్ దుర్గా రెడ్డి, కుకునూరి గోపాల్ రెడ్డి, పూల నాగరాజు, శ్రీమతి కే. కవిత, ఓరుగంటి నరేష్, కొంద్ర సంతోష్ కుమార్, బండిగారి శ్రీనివాస్ గౌడ్, ఎనుముల రవీందర్ రెడ్డి తదితరులు కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రిగారికి ఆశీర్వచనాలు అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించబడే కల్యాణోత్సవం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు.

## బౌరంపేటలో కన్నుల పండుగా 24 గంటల హరే రామ నామ స్మరణ




**కుత్బుల్లాపూర్, మార్చి25 (నేటి దర్శిని):** జై శ్రీ రామ్ హరే రామ నామస్మరణతో బౌరంపేట ప్రాంతం మారుమోగింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేటలో భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా 24 గంటల పాటు హరే రామ హరే కృష్ణ రామ రామ హరే హరే నామస్మరణతో భజన కార్యక్రమం చేపట్టారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ భజనకార్యక్రమం భక్తిశ్రద్ధలతో శ్రీరామ నామస్మరణలతో గురువారం ఉదయం 8 గంటల వరకు నిర్విరామంగా మార్మోగానుంది. ఈ భజన కార్యక్రమంలో డోలు వాయిద్యాలతో భక్తి పారవశంతో శ్రీరామ భక్తులు భజన చేస్తూ తమ భక్తుని చాటుకున్నారు.

## అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావన...!



**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని రాయపర్తి మండలంలోని పెరికేడు గ్రామంలో, తొర్రూర్ మున్సిపాలిటీ 6వ,వార్డులో గత ప్రభుత్వంలో మోసపోయిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రజా ప్రభుత్వంలోని పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసం పూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని పేర్కొన్నారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు రచ్చ రవి



**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):** ఓరుగల్లు చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయాన్ని ప్రముఖ సినీ నటుడు రచ్చ రవి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముక్కులు చెల్లించుకున్నారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ తనపై ఉంటాయని తెలిపారు. వరంగల్ వాసిగా ఇక్కడ జన్మించడం తన అదృష్టమని తెలిపారు. బలగం చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న రచ్చ రవిని చూసేందుకు భక్తులు అభిమానులు ఆసక్తి చూపారు.

## బిజిలి యోజన పథకంతో విద్యుత్ ఆదా..!




**ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో);** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త్ బిజిలి యోజన పథకానికి సంబంధించి జిల్లాలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార వాహనాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జండా ఊపి ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పిసిఓ రాంరెడ్డి ,టీజీ రెడ్ కు అధికారి పాల్గొన్నారు.

# 248 కోట్ల బడ్జెట్ కు రామగుండం కౌన్సిల్ ఆమోదం..

- ఆర్థిక సంవత్సరం ఆదాయం 248 కోట్ల 66 లక్షల,51వేలు..
- వ్యయం 221 కోట్ల 57లక్షల 76వేల రూ"లు
- మిగులు 28 కోట్ల 8లక్షల 75 వేల రూ"లు అంచనాకు ఆమోదం
- రామగుండం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి నగర మేయర్ మహంకాళి స్వామి.






(నేటి దర్శిని)గోదావరిఖని: మార్చి25
రామగుండం నగరాన్ని సకల వసతులతో కూడిన సుందర నగరంగా అభివృద్ధి చేయడానికి సహకరించాలని మేయర్ మహంకాళి స్వామి కోరారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం బడ్జెట్ ప్రత్యేక సమావేశంతో పాటు మొదటి సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు అధ్యక్షత వహించిన మేయర్ మాట్లాడుతూ.. 99రోజుల కార్యాచరణ లో భాగంగా ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక తో పాటు పలు సందర్భాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి సానిటేషన్ లోపాలను గుర్తించడం జరిగిందని అన్నారు. వాటిని సవరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని వివరించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఆర్ఎఫ్ సిఎల్ వారు సి ఎస్ఆర్ ద్వారా 550 స్ట్రీట్ లైట్స్ ఇచ్చి మరో వెయ్యి లైట్లు ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. సానిటేషన్ కు సంబందించి ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటో లు కూడా సి ఎస్ ఆర్ కింద ఇవ్వాలని కోరడం జరిగిందని అన్నారు. ఇంటి నుండి చెత్త బయటకు రాకుండా మునిసిపల్ వాహనం ద్వారా తీసుకువెళ్ళాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. వంద శాతం పన్నులు వసూలు చేసినా జీతాలకు, కరెంట్ బిల్లులకు సరిపడా ఆదాయం రావడం లేదని అన్నారు. ప్రతి ఇంటి కొలతలు తాజాగా తీసుకోవడంతో పాటు ప్రతి నిర్మాణానికి పన్ను విధించి ఆదాయం పెంపొందించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యేల చొరవతో అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని అన్నారు. ఇతర విభాగాలు కాకుండా మున్సిపల్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 567 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలించిన పదేండ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమం కొరకు రూ 260 కోట్లు వెచ్చిస్తే రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యే అయిన తరువాత కేవలం రెండేండ్ల కాలంలోనే 560కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మరో 336 కోట్ల రూపాయలు వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం విడుదల చేయాలని, ఎమ్మెల్యేల ఆద్వర్యంలో జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యేల, మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖా మంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుండి మరిన్ని నిధులు రానున్నాయని అన్నారు.రామగుండం నగర పాలక సంస్థ 2026-27 ఆర్థిక సశీవత్సరపు బడ్జెట్ వాస్తవాలకు దగ్గర ఉండే అంచనాలతో తయారు చేయడం జరిగిందని మేయర్ అన్నారు. కాగా ప్రతపాదించిన బడ్జెట్ లో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ" 248 కోట్ల 66లక్షల 51వేలు కాగా,వ్యయం 220 కోట్ల 57లక్షల 76 వేలు, మిగులు రూ 28 కోట్ల 8 లక్షల 75 వేలుగా అంచనా వేయడం జరిగిందని అన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలకు సభ్యులు ఆమోదం తెలిపారు.

**మొదటి సాధారణ సమావేశం.**
ఇందులో ఎనిమిది అంశాలు ప్రవేశ పెట్టగా అన్నింటిని ఆమోదించారు. నగర పాలక సంస్థలో ఔట్ సోర్స్ , కాంటాక్ట్ విధానంలో ఆయా విభాగాలలో పని చేస్తున్న సిబ్బందికాల పరిమితిని మరో ఏడాది పొడిగిస్తూ తీర్మానం చేశారు. ఆ తరువాత పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్ సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సంధర్భంగా మేయర్ మాట్లాడుతూ... కార్పొరేటర్లు నా దృష్టి కి తెచ్చిన సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరిస్తామని అన్నారు. ప్రతి డివిజన్ లో వీధి దీపాలు ఏర్పాటు చేయించడానికి చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు. త్వరలో 1.25 కోట్ల విలువైన టెండర్లు తెరిచి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా అభివృద్ది చెందిన నగరాలలో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయడానికి స్టడీ టూర్ ఏర్పాటు చేయాలని పలువురు కార్పొరేటర్లు కోరారు. ఈ సమావేశాల్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ, సింగరేణి, ఎన్టిపీసి, ఎన్పిడిసిఎల్ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

# పీడత పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన విప్లవ యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి

- సురవరం స్పూర్తితో ప్రజా సమస్యలపై విస్తృత పోరాటాలు
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి
- సిపిఐ ఆధ్వర్యంలో సురవరం జయంతి వేడుకలు



హనుమకొండ/గుండ్లసింగారం :(నేటి దర్శిని):
పీడత పేద ప్రజల అభ్యున్నతికి కృషిచేసిన విప్లవ యోధుడు, విరోచిత విప్లవ పోరాటాలని మలుపు తిప్పిన సిపిఐ సీనియర్ నాయకులు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అని, నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేస్తూ తుది శ్వాస విడిచే వరకు నిలబడ్డ మహోన్నత వ్యక్తి అని, వారి స్పూర్తితో ప్రజా సమస్యలపై విస్తృత పోరాటాలు సాగిస్తామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. బుధవారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలో సిపిఐ హనుమకొండ మండల సమితి అధ్వర్యంలో సురవరం సుధాకర్ రెడ్డి 84వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి మరియు నాయకులు సురవరం గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి మాట్లాడుతూ 1942లో మహబూబ్ నగర్ జిల్లా కొండ్రావుపల్లిలో జన్మించిన సుధాకర్ రెడ్డి గారు 1960 వచ్చేసరికి ఎఐఎస్ఎఫ్ విద్యార్థినేతగా ఎదిగి 1966 లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని, 1972లో అఖిల భారత యువజన సంఘం(ఎఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని, అనేక ప్రజా పోరాటాలో ప్రత్యక్షంగా పాల్గొన్న గొప్ప విప్లవ కారుడని, 2007 నుండి జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ 2012 నుండి 2019 వరకు సిపిఐ మూడు పర్యాయాలు జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారని, రాజకీయాలలో అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్న నిబద్ధత నిజాయితీ క్రమశిక్షణకు మారుపేరుగా పార్టీలో అంచలంచలుగా ఎదిగినారని, వక్తగా మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తగా ఎదిగిన నేత అని తెలిపారు. 1998లో 2004లో నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా 2 సార్లు పనిచేసిన ఆయన ఆ పదవులకు వన్నెతెచ్చి నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా కృషి చేసి ఉత్తమ పార్లమెంట్ పార్లమెంటరియన్ గా పేరు తెచ్చుకొని అనేక కమిటీలలో బాధ్యతలు నిర్వహించిన గొప్ప మేధావి అని కొనియాడారు. తొలినాళ్ల నుండి చివరి వరకు కమ్యూనిస్టు పార్టీతోనే ఉంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని చెప్పారు. ఆయనకున్న ఆస్తులను ప్రజలకు ధారా దత్తం చేసి ప్రజాసేవలో నిమగ్నమైన నిబద్ధతగల నేతని తెలిపారు. ప్రపంచ కార్మిక నాయకుడిగా పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆలోచిస్తూ స్థానికంగా ఉద్యమించండి అని ఉద్భోదించిన విప్లవోద్యమ నేత అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచి పోతుందన్నారు. సురవరం ఆశయాల సాధన కోసం పయనిస్తూ ఆయన చూపిన మార్గాన ముందుకు సాగాలని, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించడమే సుధాకర్ రెడ్డి గారికి ఘనమైన నివాళులు అర్పించిన వాళ్ళమవుతామని, వారి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై విస్తృత పోరాటాలు సాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు గాదె రాజయ్య, కట్కూరి కృష్ణ, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, తాటికంటి మమత, తాటికొండ ప్రశాంత్, బొమ్మకంటి మహేష్, రాయబారపు రాణేష్, కాలనీ వాసులు తోట రామారావు, రాయబారపు కిషన్, భూక్యా సురేష్, ఐదులపురం గాయత్రి, గాండ్ల కవిత, సాలేద్ర భాగ్యలక్ష్మి, నర్సమ్మ, సరోజన, శ్యామల రాణి, యు.రమ్య, బి. సుమలత, బి.రమా, ఎం.శిరీష, ఎం కవిత, వి.సుమలత, దామెర సరిత, తదితరులు పాల్గొన్నారు.

## మంథని ఆర్డీవో ఆఫీస్ ఎదురుగా విశ్రాంతి ఉద్యోగుల వినూత్న నిరసన చేపట్టారు



(నేటి దర్శిని): మంథని,మార్చి 25:
మంథని ఆర్డీవో ఆఫీస్ ముందు విశ్రాంతి ఉద్యోగులు బుధవారం రోజున వినూత్న నిరసన ప్రదర్శన చేశారు.పెన్షన్ వాల్యుయేషన్ యాక్ట్ 2025 నిషేధించాలన్నారు.విశ్రాంతి ఉద్యోగులలో పెండింగ్ లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేసి,పిఆర్సిని వెంటనే అమలు చేసి 2024 మార్చి తర్వాత రిటైర్డ్ అయిన ఉద్యోగుల గ్రావిటీ కమ్యూటేషన్ కూడా విడుదల చేయాలని వారు కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ సత్యనారాయణ,శ్రీనివాస్,కిషన్ రావు,పోచం,కాజా మొయినుద్దీన్ విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు..

## గురుకుల్ రిజల్ట్స్ లో ఎంపి యుపిఎస్ పంగిడిపల్లి విద్యార్థుల ప్రభంజనం



(నేటి దర్శిని): కమలాపూర్ )
విద్యార్థుల కు అభినందనలు తెలిపే కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్బంగా ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాసు మాట్లాడుతూ

అత్యంత ప్రతిభ కనబరిచి సత్తా చాటిన పంగిడిపల్లి విద్యార్థులు అని గురుకుల ప్రవేశ పరీక్ష 2026 - 27 నకు 5వ తరగతి ప్రవేశం కోసం రాసిన నలుగురు విద్యార్థులకు ఎం జె పి గురుకుల సంక్షేమ పాఠశాల లు కమలాపూర్ బాయ్స్, గర్ల్స్ లందు అత్యంత టాప్ మార్క్స్ లతో..ప్రవేశం లభించింది అని తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు 24/03/2026న వెలువడినాయి అన్నారు. ఈ సందర్బంగా , పాఠశాల ఉపాధ్యాయ బృందం కురుమిళ్ళ సారయ్య, అలిగిరెడ్డి రాజేందర్ రెడ్డి, కుమ్మరి కవిత, కత్తి రజిని, వేషాల వెంకట రాజం, కందికొండ శంకర్, డాక్టర్ మాలోత్ అఖిల్ సాయిలకు మరియు సంక్షేమ గుర్కులల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు పుల్ల స్నేహప్రియ, అన్నారపు శాన్విక వర్షిని, హన్మకొండ హరి నందన్ మరియు నాగుల ధనుష్ లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాసు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో గ్రామ వి. ఒ బాసుపాటి మౌనిక, అంగన్వాడి టీచర్ గుబిరె రజిత, పేరెంట్స్ అన్నారపు హరిబాబు, రేణుక, నాగుల శ్రీలత, గుబిరె విజయమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు, విద్యార్థిని, విద్యార్థులందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు

## డిసిసిబి బడ్జెట్ కు మహాజనసభ ఆమోదం...!

- నాబార్డ్ సహకారంతో రైతులకు డ్రోన్లు, జన ఔషధీ కేంద్రాలు: కలెక్టర్



ఉమ్మడి వరంగల్, మార్చి 25 (నేటి దర్శిని బ్యూరో):
ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మహాజనసభ బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, డిసిసిబి ఇన్చార్జ్ చాహత్ బాజ్ పాయ్ అధ్యక్షతన నిర్వహించారు. బ్యాంకు వార్షిక నివేదికతో పాటు నూతన బడ్జెట్ ప్రతిపాదనలకు మహాజన సభ ఆమోదం తెలిపింది. బ్యాంకు లాభాల బాటలో పయనిస్తుందని, నాబార్డు సహకారంతో రైతులకు డ్రోన్లు జనౌషది కేంద్రాల ఏర్పాటుకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.




# జపాన్ మంచులో సాయిపల్లవి ప్రేమకథ..

## తెలుగులో 'ఒక రోజు'గా ఏక్ దిన్!

నటి సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఒక గుడ్ న్యూస్ వచ్చింది. ఆమె నటించిన తొలి హిందీ చిత్రం 'ఏక్ దిన్' ఇప్పుడు తెలుగులో 'ఒక రోజు' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా రాబోతున్న ఈ సినిమాను అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. జపాన్ మంచు కొండల నేపథ్యంలో సాగే ఈ సుందరమైన ప్రేమకథలో సాయిపల్లవి తన సహజ సిద్ధమైన నటనతో మరోసారి మాయ చేయబోతున్నట్లు సమాచారం.ట్రైలర్ చూస్తుంటే.. కేవలం ఒకే ఒక్క రోజులో జరిగిన పరిణామాలు ఇద్దరు వ్యక్తుల జీవితాలను ఎలా మార్చాయనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ నుంచి వస్తున్న సినిమా కావడం, దానికి తోడు సాయిపల్లవి లాంటి ప్రతిభావంతురాలైన నటి ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ విభిన్నమైన ప్రేమకథను మే 1వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది



# క్యూట్‌గా కవ్విస్తున్న ప్రియాంక మోహన్..

# ధురంధర్ –2 కలెక్షన్ల సునామీ




బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది. ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.




# బంపర్ ఆఫర్ కొట్టేసిందా?

అస్సాం సుందరి కయాదు లోహర్ కెరీర్‌లో సక్సెస్ అంటే 'డ్రాగన్' సినిమా ఒక్కటే. దానికి ముందుగానీ, తర్వాత గానీ ఈ అందాలభామకు హిట్ లేదు. అయితే.. అదృష్టం మాత్రం ఈ ముద్దుగుమ్మ వెన్నంటే ఉంది. అందుకే అవకాశాలు క్యూ కడుతున్నాయి. తాజాగా ఓ క్రేజీ టాలీవుడ్ మూవీలో కయాదు ఛాన్స్ కొట్టేసినట్టు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకెళ్తే.. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా, హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే.ఇందులో వెంకీకి జోడీగా కీర్తి సురేశ్‌ని ఇప్పటికే సెలక్ట్ చేయగా, కల్యాణ్‌రామ్ సరసన కయాదు లోహర్‌ని ఖరారు చేసినట్టు తెలిసింది. అపజయం అనేది తెలియని అనిల్ రావిపూడి సినిమాలో కథానాయికగా ఛాన్స్ లభించడమంటే, అది సాధారణమైన విషయం కాదు. ఇదే నిజమైతే.. ఈ అమ్మడి రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.


# ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి..

## హైదరాబాద్‌లో కొత్త రెస్టారెంట్ ప్రారంభం



టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్' అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు. ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# క్లైమాక్స్ మనసుల్ని కదిలిస్తుంది



కోర్ట్' జోడీ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన వినోదాత్మక యువతరం సినిమా 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకుడు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 26న శ్రీరామనవమి కానుకగా విడుదల కానున్నది. ఇటీవల ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. చిత్ర సమర్పకుడు కోన వెంకట్ మాట్లాడుతూ 'ఈ కథ వినగానే రోషన్, శ్రీదేవి అయితే పర్‌ఫెక్ట్ అనిపించింది.ఈ సినిమా తర్వాత ఈ జంటను వెతుక్కుంటూ కథలు వస్తాయి. ముఖ్యంగా ఈ సినిమా క్లైమాక్స్ మనసుల్ని కదిలిస్తుంది. నా కుమార్తెలు కావ్య, శ్రావ్య ఈ సినిమాతో నిర్మాతలుగా మారారు. తప్పక విజయం సాధిస్తారని నమ్మకంతో ఉన్నా' అని అశాభావం వెలిబుచ్చారు. ఇది ఎమోషనల్ మూవీ అనీ, సాంకేతికంగా అన్ని విభాగాలూ ప్రాణం పెట్టి పనిచేశాయని, క్లైమాక్స్ కంటతడి పెట్టిస్తుందని దర్శకుడు సతీష్ జవ్వాజి చెప్పారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు హర్ష్ రోషన్, శ్రీదేవి ఆనందం వెలిబుచ్చారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365